# రాజకీయం

— గూడూరు శ్రీనివాసు

లక్షాధికారి నీలకంఠం మృత్యు శయ్యమీద ఉన్నాడు. పాపం డాక్టర్లు నిద్రాహారాలు మాని ట్రీట్ చేస్తున్నారాయన్ని ఒకవేళ బతక్కపోతే ఫీజు కేమయినా ధోకా జరుగుతుందేమో అని. కొడుకులు కూతుర్లు పోటీపడి పంతులవారీగా శుశ్రూష చేస్తున్నారు. వాటా కొద్దిగానైనా పెరగవచ్చుకదాఅని.

పాపం ఇంతమంది ఇంత కష్టపడ్డా నీలకంఠం మంచంమ్మీదనుండి లేవలేక పోతున్నాడు. కళ్ళు, చెవులు, నోరు మాత్రమే ఆన్‌లో ఉన్నాయి. ఎప్పుడు ఆఫ్ అయ్యేది చెప్పలేం అంటున్నారు డాక్టరు. ఆయనకు మాత్రం ఇంకో అయిదేళ్ళు బతికి మరోపదిలక్షలు సంపాదించాలని ఆశ. కానీ ఎలా బ్లడ్ ప్రెషర్ ఓవేపు, కాన్సర్ ఓవేపు చంపుకు తింటున్నాయి.

ఓ శుభముహూర్తాన విసుగెత్తిన డాక్టర్లు ఫీజు ఏమయినా సరే,అని తెగేసి చెప్పారు. "లాభం లేదు మేం చెయ్యాల్సిందంతా చేశాం. కానీ ఇంకో రెండ్రోజులకంటె..." అసంపూర్తిగా వదిలేశారు.

కొడుకులకు, కూతుర్లకు సంతోషించాలో దుఃఖించాలో అర్థంకాలేదు. కానీ నీలకంఠం మాత్రం భగవంతున్ని ప్రార్థించాడు.

"దేవా! నాకింకా బతకాలనుంది. నన్ను రక్షించు. నా ప్రాణం కాపాడగలిగితే నీకొండకువచ్చి యాభైవేలు సమర్పించుకుంటాను."

దేవునికి ఆశ కలిగింది బ్రహ్మదగ్గరికి వెళ్ళాడు.

"నా భక్తుడు ప్రాణం కాపాడమని వేడుకుంటున్నాడు. అతని జీవితకాలం మరో ఘడియ పొడిగించు" అర్డరిచ్చాడు.

బ్రహ్మదేవుడు వినయంగా తలూపాడు. క్షణాలమీద గ్రాంటయ్యింది అర్డరు.

○ ○ ○ ○

నీలకంఠం కాస్త లేచి తిరుగుతున్నాడు. వచ్చిన ప్రాణం యాభైవేలు హుండిలో వెయ్యాలనేసరికి మళ్ళీ పోతోంది. కాని వెయ్యకపోతే వచ్చిన ప్రాణం పొయ్యేలా ఉంది. అయినా ఆఫ్టరాల్ యాభైవేలు నెల్రోజుల్లో సంపాదించవచ్చు. డబ్బు సంపాదించడానికి ఎన్నో మార్గాలున్నాయి. అందునా తనలాంటి వాళ్ళకి మరీ.

తప్పేట్టులేదని ఒంటరిగానే బయలుదేరాడు కొండమీదికి బస్సు వెళ్తొంటే ఎక్కడపడిపోతుందో అని భయపడ్డాడు. ఏలాగోలా కొండపైకి చేరుకుంది బస్సు.



స్పెషల్‌దర్శనం టిక్కెట్టుతీసుకున్నాడు. భగవంతునిదర్శించుకుని థాంక్స్‌చెప్పేసి డబ్బు హుండీలో వేసేసాడు.

భగవంతుడు తృప్తిపడ్డాడు

నీలకంఠం తృప్తిగా ఇంటి ముఖం పట్టాడు.

○ ○ ○

మర్నాడు పేపర్లో వార్త

"నిన్న కొండమీదనుంచి దిగుతున్న బస్సు ఒకటి లోయలో పడిపోయింది. అదృష్టవశాత్తు ప్రయాణీకుల పరిస్థితి బాగానే వుంది. కానీ ఒకతను మాత్రం ప్రమాదస్థితిలో హాస్పిటల్లో చేర్చబడ్డాడు.

○ ○ ○

భగవంతుని సన్నిధిలో నిలబడి ఉన్నాడు నీలకంఠం.

"ఇదెక్కడి అన్యాయం భగవంతుడా నీ భక్తుల్ని ఇంత మోసం చేస్తావా?" ఆవేశంగా అన్నాడు.

చిద్విలాసంగా నవ్వాడు భగవంతుడు

"నీలకంఠం డబ్బు సంపాదన విషయంలో నేను నీవూ ఒకటే. తేడా అల్లా నువ్వు నీముందు తరాల వాళ్ళకోసం సంపాదిస్తున్నావు. నేను నా పెళ్ళి అప్పు తీర్చడానికి సంపాదిస్తున్నా! నువు బీదల నోళ్ళు కొడితే నేను మీనోళ్ళు కొడుతున్నాను. నువు సంపాదించిన పుణ్యం ఇంతసేపూ నిన్ను ఇక్కడ వుంచింది. మిగిలిన కాలమంతా నీ పాపం నిన్ను నరకంలో కాలుస్తుంది వెళ్ళు" ●